ఉదయరవి చంద్రిక -రూపకం

జయలక్ష్మి వరలలక్ష్మి - సంగ్రామ వీరలక్ష్మి
ప్రియురాలవై హరికి - బెరసితివమ్మా

పాలజలనిధిలోన - పసనైన మీగడ
మేలిమి తామరలోని - మించు వాసన
నీలవర్ణు నురముపై - నిండిన నిధానమవై
యేలేవులోకములు మ - మ్మేలవమ్మా

చందురుతోడబుట్టిన - సంపదల మెఱగవో
కందువ బ్రహ్మలగాచే - కల్పవల్లి
అందిన గోవిందునికి - అండనెతోడునీడవై
ఉందానవు మాయింటనే - ఉండవమ్మా

పదియారు వన్నెలతో - బంగారు ప్రతిమా
చెదరని వేదముల - చిగురుబోడి
యెదుట శ్రీవేంకటేశు - నిల్లాలవైనీవు
నిదులనిలచే తల్లి - నీవారమమ్మా

అన్నమాచార్యుల ఆంధ్రవేదంలో అలవోకగా అమరి అలరిన శ్రీసూక్త పురస్సర లక్ష్మీస్తవ సంకీర్తనమిది.

జయలక్ష్మివి, వరలలక్ష్మివి, విజయలక్ష్మివి నీవు శ్రీ మహావిష్ణునకు ప్రియభామవై ఒప్పినదానవు.

క్షీరసాగరంలోని సారమంతా మూర్తీభవించినదానవు నీవు. చతుర్దశాది సహస్రదళ కమలాలలోనూ తత్సుగంధ వైభవము నీవేనమ్మా అని ఇక్కడ ఆయన పొదిగిన శ్రీసూక్త మంత్రం ఇది.

గంధ ద్వారాం దురాధర్షాం నిత్యపుష్టాంకరీషిణీం - నీలమేఘశ్యాముని వక్షస్థలంపై కొలువై, నీవు జగమంతా పరిపాలిస్తున్న లక్ష్మి - మమ్ము దయజూడవమ్మా అని పైన చెప్పిన మంత్రంలోని ఉత్తరార్థం ఇక్కడ అలంకరించారు.

ఈశ్వరీగ్ం సర్వ భూతానాం తా మిహోపహ్వయేశ్రియం

చంద్రుడు, ఐరావతం కౌస్తుభం మొదలైన ఎన్నో ఐశ్వర్య రూపాలు ఆవిర్భవించాయి. పాలకడలిలో - వాటన్నింటిలో శ్రేష్ఠమైన సంపల్లతవు నీవు - చన్ద్రాం హిరణ్మయీం లక్ష్మీం అన్న మంత్రం అలంకరింపబడింది - బ్రహ్మను కాపాడే కల్పవృక్షానివి నీవు. విష్ణుహృన్నివాస వై, నిత్య విష్ణు విలసితవై ఉన్న నీవు మా యింటనేఉండవమ్మా అని.

అర్ద్రాం పుష్కరిణీం పుష్టిం పింగళాం పద్మమాలినీం

చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మమావహ

ఇత్యాది మంత్రార్థాలనూ - నిత్యంసాపద్మహస్తామమవసతుగృహే సర్వ మాంగళ్య యుక్తా అన్న మంత్ర శ్లోక భావాన్నీ నిండించారు.

పదియారు వన్నెలతో బంగారు ప్రతిమా! అన్న సంబోధనలో శ్రీసూక్తంలోని ప్రధమ మంత్రం 'ఓం హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం

చన్ద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మమావహ, ఇమిడింది.

చివరి చరణంలో పద్మప్రియే పద్మిని పద్మహస్తే పద్మాలయే పద్మదళాయతాక్షీ

విశ్వప్రియే విష్ణు మనోనుకూలే, తత్పాద పద్మంమయి సన్నిధత్స్వ అన్న మంత్ర శ్లోకం నెలకొల్పబడ్డది. శ్రీసూక్తానికి, ఈ కీర్తనకూ ఉన్న తేడా అల్లా శ్రీసూక్తం సంస్కృతంలో, ద్వితీయా విభక్తిలో ఉంది. ఈ కీర్తన తెలుగులో సంబోధనా ప్రధమా విభక్తిలో అలరింది.